సాక్షి మహబూబాబాద్

సోమవారం । 4 । మార్చి । 2024



సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటికలు - 8లో▸

వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాటికలు సామాజిక స్ఫూర్తినిచ్చాయి.



విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలి - 8లో▸

విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలని పీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.8^{0} /20.2^{0}

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కూలీల తిరుగుప్రయాణం



దోర్నకల్: మిరప తోటల్లో పనుల కోసం మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలుస్వగ్రామాలకు బయలుదేరారు. వారం రోజులుగా వివిధ గ్రామాల నుంచి డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఇక్కడి నుంచి రైలులో స్వస్థలాలకు వెళ్తున్నారు. ప్రతిరోజు 500మందికి పైగా కూలీలు ఇక్కడి నుంచి తరలివెళ్తున్నారు.

పరీక్షలపై భయం వీడాలి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు పరీక్షల భయం వీడాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారి ఆర్.బాలరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీస్తాయని, భయపడొద్దని సూచించారు. ఎలాంటి ఒత్తిడి, భయానికి గురికాకుండా వార్షిక పరీక్షలు రాయాలన్నారు. రానున్న 15రోజులు చాలా కీలకమని, పక్కా ప్రణాళికతో ఉదయం, సాయంత్రం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సబ్జెక్ట్‌లపై ఉపాధ్యాయ నిపుణులతో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ విత్తనాల సుధాకర్, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

డీఎస్పీ తిరుపతిరావు



మహబూబాబాద్ రూరల్: రౌడీ షీటర్లు, గొడవలు సృష్టించే వారు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆదివారం మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, గొడవలు సృష్టించే వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు, గొడవలు సృష్టించే వారు శాంతియుతంగా ఉండాలని, చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అసాంఘిక కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవద్దని పేర్కొన్నారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు పవన్ కుమార్, అరుణ, శివ, బ్లూకోల్ట్స్ పీసీలు సక్రాం, రాంబాబు, నాగరాజు, వీరన్న పాల్గొన్నారు.

6 నుంచి ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 6వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 6, 11, 13, 15 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పరీక్షలు ఉంటాయన్నారు. అలాగే ఏడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 6వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. 6, 11, 13, 15, 18 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

20 నుంచి దూరవిద్య పీజీ సైన్స్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్యాకేంద్రం పీజీ సైన్స్ కోర్సుల మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 20వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ మొదటి ఏడాది పరీక్షలు ఈనెల 20, 22, 26, 28 తేదీల్లో నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

‘నామినేటెడ్’పై నజర్

మార్కెట్ కమిటీ పదవులపై నాయకుల గురి

- మారిన రిజర్వేషన్‌తో తీవ్ర ప్రయత్నాలు
- స్థానిక ఎమ్మెల్యేల నిర్ణయమే కీలకం
- పార్లమెంట్ ఎన్నికల లోపే నియమించే అవకాశం



సాక్షి, మహబూబాబాద్: జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవులపై దృష్టి సారించారు. మార్కెట్ కమిటీ పదవులను దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. జిల్లాలో ఎస్టీ జనాభా అధికంగా ఉంది. దీంతో ప్రత్యక్ష ఎన్నికల్లో ఎక్కువ పదవులు ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వుడ్ కావడంతో ఇతర వర్గాలకు నామినేటెడ్ పదవులే ఆధారమయ్యాయి. ఈ మేరకు పదవులు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

మారిన రిజర్వేషన్

జిల్లాలో మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నాయి. 2018 ఏప్రిల్ 30న రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారం రెండు సంవత్సరాలకు కేసముద్రం మార్కెట్ బీసీ–సీ మహిళ, మహబూబాద్ మార్కెట్ బీసీకి రిజర్వు చేశారు. అయితే వారు ఎన్నికైన తర్వాత ప్రభుత్వాలు మారడంలో మార్కెట్ కమిటీలు అనివార్యంగా రద్దు చేశారు. అయితే ఇప్పుడు రొటేషన్ పద్ధతిలో మహబూబాబద్ ఎస్టీ జనరల్, కేసముద్రం ఓసీ మహిళ, తొర్రూరు ఓసీ జనరల్‌కు కేటాయిస్తారు.

ఎమ్మెల్యేల చేతిలో పదవులు

మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యేల నిర్ణయమే కీలకంగా ఉంటుంది. అయితే మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ పదవి డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన వారికి, వైస్ చైర్మన్ మహబూబాద్ నియోజకవర్గానికి, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ మహబూబాబాద్ నియోజకవర్గానికి, వైస్ చైర్మన్ డోర్నకల్ నియోజకవర్గానికి, తొర్రూరు చైర్మన్ పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన రైతులకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. కాగా చైర్మన్‌తో పాటు 12 మంది రైతులు, ఇద్దరు ట్రేడింగ్ లైసెన్స్ ఉన్నవారు, ఒక పీఏసీఎస్ చైర్మన్, మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ అనుబంధ రంగాలైన హార్టికల్చర్, పశుసంవర్ధక మొదలైన శాఖల ఏడీఏల్లో ఒక్కరు, స్థానిక సంస్థలు మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల్లో ఒక్కరితో కమిటీ ఏర్పాటు చేస్తారు. డోర్నల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, మహబూబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, తొర్రూరు ఎమ్మెల్యే యశస్విని చేతుల్లో ఈ పదవులు ఉన్నాయి.

అనుచరుల ద్వారా..

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులపై ఆశ పెట్టుకున్న నాయకులు, వ్యాపారులు ఇప్పటికే తమ అనుచరుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ పదవి ఎస్టీ రిజర్వుడ్ కావడంతో డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన పలువురు ఎస్టీ నాయకులు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తో పాటు, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి ద్వారా పైరవీలు ముమ్మరం చేశారు. అదే విధంగా కేసముద్రం మార్కెట్ చైర్మన్ కోసం మహబూబాబాద్ పట్టణానికి చెందిన ట్రేడింగ్ వ్యాపారితో పాటు ప్రముఖ కిరాణం వ్యాపారి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కలవడం, డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా గతంలో చైర్మన్ పదవిలో రాజకీయ పలుకుబడితోపాటు ఆర్థికంగా ఉన్నవారినే ఎంపిక చేసేవారు. అయితే ఇప్పుడు ఎలాంటి వారికి ప్రాధాన్యత ఇస్తారో.. ఎవరిని ఎంపిక చేస్తారో వేచి చూడాల్సిందే.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు



తొర్రూరులో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- జిల్లాలో 74,266 మంది చిన్నారులకు చుక్కల మందు పంపిణీ

నెహ్రూసెంటర్: మహబూబాబాద్‌ను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పిల్లలకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు కాపాడుతాయని, అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5సంవత్సరాల లోపువారికి పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అంబరీష, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు 74,266 మందికి పంపిణీ..

జిల్లాలో మొదటిరోజు 74,266 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. 453 బూత్‌లను ఏర్పాటు చేసి పంపిణీకి వైద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. బస్టాండ్ ప్రాంగణం, ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలతో పాటు మొబైల్ టీమ్స్ ద్వారా చుక్కల మందు పంపిణీ చేపట్టినట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు.



దోర్నకల్ రైల్వేస్టేషన్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

నేడు, రేపు ప్రత్యేకంగా పంపిణీ..

పోలియో చుక్కలు వేసుకోకుండా మిగిలిపోయిన పిల్లలకు నేడు, రేపు (సోమ, మంగళవారం) ప్రత్యేకంగా ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది చుక్కల మందు పంపిణీ చేయనున్నారు. వందశాతం పోలియో చుక్కలను పంపిణీ చేసేలా వైద్యశాఖ చర్యలు చేపట్టింది.

తొర్రూర్రులో..

తొర్రూరు: ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేయించడం ద్వారా పోలియో రహిత సమాజం నిర్మాణమవుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల్లో ఏ ఒక్కరూ మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అంగవైకల్యం లేని నియోజకవర్గంగా పాలకుర్తిని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగంచేసుకోవాలి

- విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



జీరో బిల్లును తీసి లబ్ధిదారురాలికి అందజేస్తున్న విప్ రాంచంద్రునాయక్

కురవి: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ఆయన జీరో బిల్లు తీసి లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గృహజ్యోతిలో జీరో బిల్లును అందజేయడం వల్ల పేదలకు ఉపయోగపడుతుందని వివరించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులై ఉండి పథకం లబ్ధిపొందకపోతే ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ జనగాం నరేష్ మాట్లాడుతూ.. రైతులు తమ బావులకు కెపాసిటర్లు బిగించాలని సూచిచారు. కార్యక్రమంలో డీఈ విజయ్, ఏడీఈ రమేష్, ఏఏఓ లావణ్య, ఏఈ శారద, ఎంపీడీఓ వీరబాబు, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌కుమార్, ఎర్ర నాగేశ్వర్‌రావు, అవిరె మోహన్‌రావు, గొల్లపల్లి రజనీకాంత్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటానని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని రామాలయం, ముత్యాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన పార్టీ గ్రామ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. త్వరలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా ఎమ్మార్సీలో పనిచేస్తున్న మెసేంజర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఆ సంఘం రాష్ట్ర బాధ్యుడు బానోతు భిక్షపతి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, రాయపురం సాంబయ్య, బండారు వెంకన్న, ఎంపీటీసీ క్రిష్ణమూర్తి, బండారు దయాకర్, రావుల మురళీ, నూకల వెంకటేశ్వర్లు, తండా వెంకన్న, పోలెపాక నాగరాజు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, మహబూబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో గిరిజన ప్రజాప్రతినిధుల సన్మాన సభ ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమైందని, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూములకు పట్టాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన, ఆదివాసీలు ప్రభుత్వానికి అండగా నిలవాలకోరారు. అనంతరం ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు బాలోత్ నెహ్రూనాయక్, డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ, అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్, తేజావత్ వాసునాయక్, బోడ రమేష్‌నాయక్, భూక్య శ్రీనునాయక్, భూక్య బాలాజీనాయక్, మల్సూర్ నాయక్, రమేష్‌నాయక్, మంగీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులం 6, 7, 8వ తరగతుల్లో మిగిలిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసిందని బీసీ గురుకులం జిల్లా కన్వీనర్ జి.అనిత అన్నారు. జిల్లాలోని 8పరీక్ష కేంద్రాల్లో 1,972 మంది విద్యార్థులకు గాను 1,749 మంది హాజరై, 223మంది గైర్హాజరయ్యారని చెప్పారు. డీఈఓ పి.రామారావు, జిల్లా పరీక్షల విభాగ అధికారి మందుల శ్రీరాములు పలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించినట్లు చెప్పారు.

అవిశ్వాసం నెగ్గేనా..!

- ఆర్డీఓ సమక్షంలో నేడు మానుకోట మున్సిపల్ వైస్ చైర్మన్‌పై తీర్మానం
- ప్రత్యేక క్యాంపులోనే సుమారు 23 మంది కౌన్సిలర్లు
- ఎవరు నెగ్గినా మళ్లీ పగ్గాలు బీఆర్ఎస్‌కే..



మానుకోట మున్సిపాలిటీ కార్యాలయం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో నేడు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు అవిశ్వాస పత్రాన్ని అందజేశారు. అందుకు కలెక్టర్ ఈనెల 4న మధ్యాహ్నం 3 గంటలకు అవిశ్వాస సమావేశం ఉంటుందని కౌన్సిలర్లకు సమాచారం అందించిన విషయం తెలిసిందే. కాగా మున్సిపాలిటీ కార్యాలయంలో తగు ఏర్పాట్లు చేశారు.

36 వార్డులు..

మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా.. ఒకవార్డు కౌన్సిలరు మృతి చెందాడు. దీంతో ప్రస్తుతం35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో 22 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, 9 మంది కాంగ్రెస్, ఇద్దరు సీపీఎం, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు ఉన్నారు. కాగా వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్‌పై అవిశ్వాసం పెట్టాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 19మంది, కాంగ్రెస్ నుంచి 8, సీపీఎం నుంచి ఇద్దరు సిద్ధమై సంతకాలు చేశారు. దీనిలో అవిశ్వాసానికి అనుకూలంగా చైర్మన్ సంతకం చేశారు. దీంతో గత నెల 12న సుమారు 18మంది కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు అవిశ్వాస పత్రం అందజేశారు. పార్టీలకతీతంగా నిర్ణయం తీసుకుని కలెక్టర్‌కు పత్రం అందజేశారు. కాగా కౌన్సిలర్లు చిట్యాల జనార్దన్, బండి ఇందిర, పోతురాజు రాజు, సీపీఐకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు ఆనాడు సంతకాలు పెట్టని వారిలో ఉన్నారు.

ప్రత్యేక క్యాంపు కౌన్సిలర్లు..

అవిశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని కౌన్సిలర్ మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో కొన్ని రోజుల క్రితం కౌన్సిలర్లు టూర్‌కు వెళ్లారు. టూర్‌లో 23మంది కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం. 30 మంది తమకు అనుకూలంగా ఉన్నారని క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు చెబుతున్నారు. సీపీఐ మద్దతు కోసం కూడా కౌన్సిలర్ మార్నేని వెంకన్న తీవ్రంగా ప్రయత్నాలు చేసిన్నట్లు సమాచారం. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి, కౌన్సిలర్ నీరజారెడ్డి ధర్మన్న ఈనెల 2న పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అవిశ్వాసంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. వారు ఎవరికి మద్దతు ఇస్తారన్నది నేడు తేలనుంది.

నెగ్గాలంటే 25 మంది చేతులెత్తాలి..

మున్సిపాలిటీలో ప్రస్తుతం 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారితో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా (ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ కవిత, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్)ఉన్నారు. వీరిని కలిపితే 38 ఓట్లు అవుతాయి. దీనిలో టు బై థర్డ్ అంటే 25ఓట్లు ఉండాలని (చేతులు లేపాలని) కమిషనర్ నోముల రవీందర్ తెలిపారు. ఆర్డీఓ అలివేలు సమక్షంలో అవిశ్వాస తీర్మానం జరుగుతుంది. కాగా అవిశ్వాసంలో ఎవరు నెగ్గినా మళ్లీ బీఆర్ఎస్ కౌన్సిలరే వైస్ చైర్మన్ అవుతారు. కాగా మార్నేని వెంకన్న వైస్ చైర్మన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

జన్మదినాన్ని వివాదంగా మార్చడం సరికాదు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్

తొర్రూరు: తన జన్మదినాన్ని వివాదంగా మార్చడం భావ్యం కాదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గుండాల మురళీధర్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మురళీధర్ మాట్లాడారు. హెచ్ఐవీ, కుష్ఠు వ్యాధుల నిర్మూలనపై ఈ నెల 2న స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు మండలాల ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. దానిలో భాగంగా వారికి భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. భోజనాల అనంతరం తన పుట్టినరోజు అని తెలుసుకున్న ఆరోగ్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారన్నారు. విధులు వదిలేసి సిబ్బంది పుట్టినరోజు వేడుకలు చేశారని, మందు తాగి చిందులు వేశారని పలువురు ఆరోపించడం సత్యదూరమన్నారు. అంకితభావంతో పనిచేసే అధికారులపై బురద చల్లడం సరికాదన్నారు.

అధికారుల విచారణ..

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ జన్మదిన వేడుకల వివాదంపై అధికారులు విచారణ చేపట్టారు. ఆర్డీఓ నర్సింగరావు, తహసీల్దార్ వినోద్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆపరేషన్ గదిలో వేడుకలు జరపలేదని, అది డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయమని వైద్యాధికారులు వారికి తెలిపారు. ఈ ఘటనపై జిల్లా వైద్యాధికారులు సైతం ఆరా తీసినట్లు తెలిసింది.

పోలియో చుక్కలు వేయించాలి


- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుమ్మాడూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి కలెక్టర్ హాజరై చిన్నారులకు చుక్కలమందు వేసి మాట్లాడారు. నేడు, రేపు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ అంబరీష మాట్లాడుతూ.. పోలియోను అంతం చేయడానికి మనమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్ కుమార్, యూపీఎస్సీ మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్లబోయిన శ్రీనివాస్, పల్స్‌పోలియో నోడల్ అధికారులు శ్రీకాంత్, కె.వి. రాజు, గీత, హెల్త్ ఎడ్యుకేటర్, డీపీఓ రుక్మొద్దీన్, వైద్యులు కిరణ్మయి, విజయ కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దడువాయిలను స్కిల్ వర్కర్లుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సరసాని సురేందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: లైసెన్స్ విధానం రద్దు చేసి దడువాయిలను స్కిల్ వర్కర్లుగా గుర్తించాలని దడువాయి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర దడువాయి సంఘం నూతన కమిటీ సమావేశం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ అనేది స్వయంప్రతిపత్తిగల యాజమాన్య వ్యవస్థ అని, తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. లైసెన్స్ విధానం వల్ల తాము మార్కెట్ కార్మికులుగా కాకుండా, ఉద్యోగులుగా కాకుండా మిగిలిపోతున్నామని, తమకు ఎలాంటి కార్మిక చట్టాలు కూడా వర్తించడంలేదన్నారు. తాము పనిచేస్తున్న యాజమాన్యాలు తమపై నిర్లక్ష్యం వహిస్తూ అన్యాయానికి గురిచేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనావత్ రవికుమార్, సంఘం వరంగల్ మార్కెట్ అధ్యక్షుడు దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలం రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్, దసురు, మంగీలాల్, వివిధ జిల్లాల మార్కెట్ల నుంచి రాష్ట్ర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


బొమ్మకంటి వంశీ

దామెర : ల్యాదెళ్లకు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్లకు చెందిన యువకుడు బొమ్మకంటి వంశీ చిన్నతనం నుంచి మతిస్థిమితం సరిగా లేకుండా చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతుండే వాడు. పొద్దంతా ఎక్కడికి వెళ్లినా రాత్రికి ఇంటికి చేరుకునేవాడు. కాగా ఫిబ్రవరి 27న ఇంటి నుంచి బయటికి వెళ్లిన వంశీ తిరిగి రాలేదు. దీంతో వంశీ తండ్రి పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు. వంశీ చామనఛాయ రంగు కలిగి, కోల ముఖం, 5 ఫీట్ల ఎత్తు ఉంటాడన్నారు. నీలిరంగు ప్యాంట్, ముదురు నీలి రంగు షర్ట్ వేసుకుని ఉన్నట్లు వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85020, 87126 85228 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అరవింద్‌రెడ్డి (ఫైల్)

నెక్కొండ : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన రావుల అరవింద్‌రెడ్డి (20) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అరవింద్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో అరవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తండ్రి మధుకర్ రెడ్డి, తల్లి రజిత, చెల్లి హర్షిత ఉన్నారు. అరవింద్‌రెడ్డి మృతితో నెక్కొండలో విషాదఛాయలు అలుముకున్నాయి.


రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన డీసీఎంలు

మహదేవపూర్ : అక్రమంగా తరలిస్తున్న 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానిక యువకులు ఆదివారం మండల కేంద్రంలో పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ కరీంనగర్‌లోని సుమంగళి ట్రేడర్స్ నుంచి మహారాష్ట్రలోని జానకి ట్రేడర్స్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని కాటారంలోని అన్నపూర్ణ రైస్ మిల్లులో భద్రపరుస్తామన్నారు. డీసీఎం డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా, యువత.. రేషన్ బియ్యం అక్రమ రవాణపై తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

కడుపు 'ఉబ్బరం'తో కలవరం

- పశువులకు సోకుతున్న అరుదైన వ్యాధి
- ఆందోళనలో పాడి యజమానులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



కరీమాబాద్ : పశువుల్లో కడుపు 'ఉబ్బరం' వ్యాధి కలవరపెడుతోంది. పశువులకు సోకుతున్న వ్యాధితో యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. సాధారణంగా పశువులకు కొన్ని సీజనల్ వ్యాధులు వస్తాయి. అయితే కడుపు ఉబ్బరం వ్యాధి మాత్రం పాడి పశువులలో అరుదుగా కనిపిస్తుంది. దీనిపై జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించి ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

వ్యాధి రెండు రకాలు..

పశువులకు సోకుతున్న కడుపు ఉబ్బరం(బ్లోట్) వ్యాధి రెండు రకాలు ఉంటుంది. వాటిలో ఒకటి ప్రైమరీ బ్లోట్, రెండో ప్రోతీబ్లోట్. ఈ వ్యాధులు ఎక్కువగా మేతకు సంబంధించిన కారణాలతోనే వస్తుంటాయి.

మేతకు సంబంధించి..

చెట్ల ఆకులు, గడ్డిని ఎక్కువగా తినిపించడం, లెగ్యూమ్ జాతి గడ్డి రకాలను ఎక్కువగా మేపడం, రెడ్‌క్లోవర్, అల్ఫా వంటి గడ్డి జాతులను ఎక్కువగా మేపడం, యూరియా చల్లిన ధాన్యపు జాతి గడ్డి రకాలను మేపడం, ఉడకబెట్టిన అన్నం అధికంగా తినిపించడం ద్వారా కూడా ఈ వ్యాధి సోకుతుంది. ఇక ప్రోతీ బ్లోట్ సోకేందుకు పచ్చిగడ్డిలో ఉండే సైటోప్లాస్మిక్ ప్రోటిన్ల మూలంగా నిరంతరం కడుపు(రూమెన్)లో నురగ తయారవుతుంది. అధిక


కడుపు ఉబ్బిన ఆవు

కాల్షియం, తక్కువ ఫాస్ఫరస్ గల గడ్డి రకాలు, హిస్టమిన్, హైడ్రోజన్ సల్ఫైడ్ అధికంగా ఉండే లెగ్యూమ్ జాతి గడ్డి రకాలను ఎక్కువగా మేపడంతో కడుపులో నురగ తయారవుతుంది.

వ్యాధి క్రమం..

పశువుల కడుపు, రెటిక్యులంలో అధికంగా గాలి తయారవడం లేదా తయారైన గాలి బయటకు వెళ్లక పోవడం మూలంగా కడుపులో గాలి శాతం పెరిగి ఉబ్బుతాయి. ఫలితంగా విభాజక పటలంపై ఒత్తిడి పెరిగి ఊపిరితిత్తులలో హైపాక్సియం స్థితి ఏర్పడి పశువులు మృత్యువాత పడొచ్చు. గుండెలో టాకికార్డియా ఏర్పడి నాడి రేటు పెరిగి కొన్ని సందర్భాల్లో పశువుల గుండె ఆగి మృత్యువాత పడొచ్చు.

వ్యాధి లక్షణాలు..

పశువుల్లో కడుపు గాలితో నిండి ఉంటుంది. ఫలితంగా చేతివేళ్లతో తట్టినప్పుడు డ్రమ్ లాంటి శబ్దం వినిపిస్తుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటకు పెట్టి పళ్లు కొరకడం, తల పై కెత్తి శ్వాస కష్టంగా తీసుకోవడం, పదే పదే పొట్టను చూస్తూ కాళ్లతో తన్నుకోవడం, విరేచనాలవుతాయి. ఆకలి మందగించి పశువులు నీరసంగా ఉంటాయి. శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది.

వ్యాధి నివారణకు...

ఉబ్బరం తగ్గే వరకు పశువులకు ఎలాంటి ఆహారం, నీరు పెట్టొద్దు. పశువుల ముందు భాగం(తల వైపు భాగం) ఎత్తుగాను, వెనక భాగం పల్లంగా ఉండేలా చూడాలి. చార్కోల్ గానీ చెక్కముక్క గానీ నోట్లో పెడితే లాలాజలం ఉత్పత్తి పెరిగి కడుపులో నురగతో కూడిన గాలి తగ్గుతుంది.

పశువులకు చికిత్స...

సోడియం బైకార్బొనేట్‌ను తగిన మోతాదులో నీటిలో కలిపి తాగించాలి. వేరుశనగ, నువ్వుల నూనె 500 ఎంఎల్ నుంచి లీటర్ వరకు తాగించొచ్చు. బ్లోటోసిల్, బ్లోటోనిల్, టింపానిల్ లాంటి ద్రావణాలను 80–90 ఎంఎల్ వరకు తాగిస్తే ఫలితం ఉంటుంది. పశువులు త్వరగా కోలుకునేందుకు సెలైన్‌ను ఎక్కించడంతోపాటు మల్టీ విటమిన్లు, మినరల్ కలిగిన ఇంజక్షన్లు ఇస్తే పశువులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

పశువులను గమనిస్తుండాలి



పశువుల మేత విధానాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. కడుపు ఉబ్బరం ఉన్నప్పుడు చొంగ కారడం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కడుపు ఉబ్బినట్టు కనిపించగానే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులకు చికిత్స అందించిన తర్వాత అవి వెంటనే మేత మేయలేవు. అందుకే సెలైన్ బాటిల్స్ ఎక్కించాలి. మల్టీవిటమిన్ ఇంజక్షన్లు వేయించాలి.

-డాక్టర్ శశాంక్, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

విద్యుత్ సంస్థల బలోపేతానికి కృషి చేయాలి

- తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ : విద్యుత్ సంస్థల బలోపేతానికి పవర్ ఇంజనీర్లు, ఉద్యోగులు కృషి చేయాలని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేగ సమ్మయ్య అన్నారు. అదివారం హనుమకొండ నక్కలగుట్టలో అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరముందని, ఈ దిశగా ఉద్యోగులు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా అసోసియేషన్‌ను బలోపేతం చేయాలన్నారు. పవర్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. నాయకత్వం ఎల్లప్పుడు సభ్యులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు అందిస్తోందన్నారు. సభ్యులకు ఏమైనా ఇబ్బందులుంటే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా 2024-క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ అడ్వయిజర్ వరప్రసాద్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి వంగ రవీందర్, అధ్యక్షుడు ఆర్.పాండు, అడిషనల్ సెక్రటరీ బి.సుధాకర్, జిల్లాల కార్యదర్శులు, ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

డీసీఎం, లారీ ఢీ

- 11 మంది కూలీలకు గాయాలు
- పెగడపల్లి క్రాస్ వద్ద ఘటన


గాయపడిన కూలీలు

హసన్‌పర్తి: డీసీఎం,లారీ ఢీకొన్న ఘటనలో 11 మంది కూలీలు గాయపడ్డారు. ఈఘటన ఆదివారం ఆరెపల్లి–యాదాద్రి జాతీయ రహదారి మధ్యలోని పెగడపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. పెగడపల్లికి చెందిన 11 మంది కూలీలు మిర్చి ఏరడానికి డీసీఎంలో నడికూడకు బయలుదేరారు.అయితే వీరి వాహనం పెగడపల్లి క్రాస్ వద్దకు చేరుకుంది. ఆరెపల్లి వైపు నుంచి బయలుదేరిన లారీ పెగడపల్లి క్రాస్ యూ–టర్న్ తీసుకునే ఈక్రమంలో అదుపు తప్పి డీసీఎంను ఢీకొంది. ఈప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న పెగడపల్లికి చెందిన నేనిటి పుష్ప, వేల్పుల రాజమ్మ, రాధక్క, సన్నబోయిన ఐలమ్మ, మ్యాదరబోయిన రాజమ్మ,గండు ఎల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, డీసీఎం–లారీ ఢీకొన్న ప్రమాదంలో కూలీలు గాయపడిన విషయాన్ని పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కమలాకర్ స్థానిక ఎమ్మెల్యే నాగరాజుకు సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎంజీఎం ఆర్ఎంతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


రవీందర్(ఫైల్)

దుగ్గొండి : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం మహ్మదాపురంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాలడుగుల రవీందర్(52) కొన్నేళ్లుగా ఫర్టిలైజర్ షాపు నడుపుతున్నాడు. నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు షాపుతో సహా ఇంటిని విక్రయించినా అప్పు తీరలేదు. భూమి అమ్మి అప్పులు తీర్చుదామని చూడగా అప్పటికే భూమిని రవీందర్ తల్లిదండ్రులు కూతుళ్లకు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రవీందర్ శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా రవీందర్ అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.

భార్య మందలించిందని వలస కూలీ..


కలకాను పుటేల్ మృతదేహం

సంగెం : భార్య మందలించిందని వలసకూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగిర్ జిల్లా పాట్నాగర్ మండలం బూచేపల్లికి చెందిన కలకాను పుటేల్(62) భార్యా పిల్లలతో కలిసి సంగెం మండలం ఆశాలపల్లి శివారులో ఇటుకల తయారీ పనికోసం డిసెంబర్‌లో వలస వచ్చారు. ఈనెల 2న యజమాని కూలి డబ్బులు ఇవ్వగా మద్యం తాగి ఖర్చు చేశాడు. వచ్చిన డబ్బులు తాగుడుకు ఖర్చు చేస్తే బతకడం ఎట్లా అని భార్య జమున పుటేల్‌ను మందలించింది. ఈ క్రమంలో పుటేల్ ఆదివారం తెల్లవారు జామున బయటికి వెళ్లి రాలేదు. చుట్టుపక్కల వెతకగా ఇటుకల బట్టీల పక్కన చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుమారుడు ఉమాకాంత్ ఉరితాడు విప్పి చూడగా కొనఊపిరి ఉండడంతో యాజమాని బుచ్చయ్య చౌదరి కారులో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

రైతుపై పగ.. పశువులను చంపిన దుండగులు

- నీటి తొట్టిలో యూరియా కలిపిన వైనం
- ఆ నీటిని తాగిన మూడు మూగజీవాలు మృత్యువాత

రఘునాథపల్లి : రైతు మీద పగతో పశువుల ప్రాణం తీశారు. నీటి తొట్టిలో యూరియా కలపడంతో అందులోని నీటిని తాగిన రెండు ఆవులు, ఒక కోడె మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన ఆదివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గిద్దబండతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన బానోత్ తిరుపతి ఇటీవల వరి పంటకు యూరియా చల్లగా.. మిగిలిన సగం బస్తా యూరియా పశువుల పాకలో నిల్వచేశాడు. శనివారం తన రెండు ఆవులు, ఒక కోడెను పశువుల పాకలో కట్టేసి ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న దుండగులు పాకలో ఉన్న యూరియాను నీటి తొట్టిలో కలిపా రు. సాయంత్రం తిరుపతి భార్య సునీత పాకలో ఉన్న పశువులను వదలడంతో అవి తొట్టిలోని నీళ్లు తాగాయి. రాత్రి సమయంలో ఓ ఆవు ప్రాణం వదలగా, మిగతా రెండు ఆదివారం ఉదయం మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనపై పశువైద్యుడిని తీసుకురాగా విష ప్రయోగం జరిగినట్లు నిర్ధారించారు. పాకలో ఉన్న యూరియా కనిపించకపోవడంతో నీటి తొట్టిని పరిశీలించారు. అడుగు భాగంలో యూరియా ఆనవాళ్లు ఉండడంతో గిట్టని వారు చేసిన పనిగా బాధితులు కన్నీరు మున్నీరవుతున్నా రు. కాగా, మృత్యువాత పడిన పశువుల విలువ రూ.లక్షా పదివేలు ఉంటుందని బాధితులు తెలిపారు.



విషపు నీరు తాగి మృత్యువాత పడిన ఆవులు

సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ కె.తిరుమల్‌రావు తెలిపారు. ఈ నెల 6న జనగామ డివిజన్ రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో నర్మెట, ఖిలాషాపూర్, రఘునాథపల్లి, తరిగొప్పుల సెక్షన్ పరిధి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 7న హనుమకొండ రూరల్ డివిజన్ ధర్మసాగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టుకు ఐనవోలు, ధర్మసాగర్, పంథిని, 13న హుజూరాబాద్ డివిజన్ జమ్మికుంట సబ్‌డివిజన్ పరిధి తనుగుల సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టుకు చల్లూరు, జమ్మికుంటరూరల్, జమ్మికుంట రూరల్ వెస్ట్, జమ్మికుంట టౌన్, తనుగుల, వీణవంక, 19న భూపాలపల్లి డివిజన్ కాటారం సబ్‌డివిజన్ పరిధి మహాముత్తారం సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో కాటారం, కొయ్యూరు. మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల సెక్షన్ పరిధి వినియోగదారులు ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. ఈ లోకల్ కోర్టులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మేడారం హుండీ ఆదాయం రూ.71 లక్షలు


భక్తురాలు పేపర్‌పై రాసిన కోరిక

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ లెక్కింపు నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. 88 ఐరన్ హుండీలు విప్పి కానుకలు లెక్కించగా రూ.71,67,000 ఆదాయం లభించింది. గడిచిన మూడు రోజులు నిర్వహించిన లెక్కింపులో రూ.9,60,36,000 వచ్చాయి. నాలుగో రోజుతో కలుపుకుని 405 హుండీల్లో రూ.10,32,03,000 ఆదాయం నమోదైంది. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేశామని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా ఓ భక్తురాలు.. మా ఆయన బెట్టింగ్ మానేయాలి.. మా అక్క కొడుక్కి ఐఐటీలో సీట్ రావాలి అని రాసిన పేపర్ హుండీలో లభించింది.

కిరాణషాపు దగ్ధం

మహదేవపూర్ : మండలంలోని బొమ్మాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన మేకల వెంకటి కిరాణషాపు ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. షాపులోని ఫ్రిజ్, బీరువా, ఫర్నిచర్ ఇతర వస్తువులతో పాటు కిరాణసామగ్రి మొత్తం కాలిపోయిందని విలపించాడు. దాదాపు రూ.1,50,000 వరకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రోదించాడు.

పేదింటి బిడ్డకు పెద్దకష్టం

- ఆరోగ్యం క్షీణిస్తోంది ఆదుకోండి
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న సతీశ్
- ఆపరేషన్ చేయించుకోలేని దుస్థితి
- సాయమందించి ప్రాణాలు నిలపాలని వేడుకోలు

దీన గాథ


సతీశ్‌కు అన్నం తినిపిస్తున్న కుటుంబసభ్యులు

పాలకుర్తిటౌన్: రంగురంగుల బొమ్మలాటల మధ్య జీవితం గడిపేవాడు. తన కుటుంబానికి తానే హీరో అనుకునేవాడు. తనను నమ్ముకున్న వాళ్లను ఉన్నతస్థానంలో నిలబెట్టాలని కలలు కనేవాడు. భార్యా పిల్లలతో జీవితం సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో విధి వెక్కిరించింది. అరుదైన వ్యాధి కారణంగా అతడు మంచానికే పరిమితమయ్యాడు. అతడిని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడింది. చికిత్స చేయించే స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఇప్పుడా కుటుంబం ఎదురు చూస్తోంది.

అరుదైన వ్యాధి..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామానికి చెందిన 34 ఏళ్ల జిలుకర సతీశ్ సినిమా థియేటర్లో పని చేసేవాడు. వచ్చిన మొత్తంతో కుటుంబాన్ని పోషించేవాడు. అతడికి భార్య విజిత, ఇద్దరు కుమారులు లోకేశ్, ధన్విక్. తండ్రి మరణించడంతో తల్లికి తోడుగా నిలిచి కాయాకష్టం చేసి సోదరి మౌనిక వివాహం దగ్గరుండి జరిపించాడు. బాధ్యతలు తీరాయనుకునే సమయంలో 4 నెలల క్రితం సతీశ్ అనారోగ్యానికి గురయ్యాడు. హనుమకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించగా.. కాలేయ సంబంధిత ప్రాంక్రియాస్ వ్యాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారు. తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని, దానికి లక్షల్లో ఖర్చు ఉంటుందని వైద్యులు తెలపడంతోపేద కుటుంబం ఏం చేయాలో పాలుపోక కన్నీటి పర్యంతమైంది.

ఇప్పుడతడు ఎముకలగూడు!

క్రమక్రమంగా సతీశ్ కడుపులో గడ్డలు, నీటి బుడగలు ఏర్పడడంతో జీర్ణ వ్యవస్థ దెబ్బతిని ఆహారం తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో ద్రవ రూప ఆహారం మాత్రమే తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు నెలల క్రితం బలిష్టంగా ఉన్న సతీశ్ ఆరోగ్యం క్షీణిస్తూ ఎముకల గూడు వలే తయారయ్యాడు. వ్యాధిని నయం చేసేందుకు ఆ పేద కుటుంబం అందినకాడల్లా అప్పులు చేసి వైద్యం చేయించారు. అయినా ఎలాంటి ఫలితం దక్కలేదు. ఇదిలా ఉండగా.. నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చవుతున్నాయి. ఓ వైపు పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారింది. సతీశ్‌కు ఆపరేషన్ చేయిస్తే తిరిగి మామూలు స్థితికి చేరుకునే అవకాశం ఉంది. శస్త్ర చికిత్సకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుండడంతో దిక్కు తోచని స్థితిలో ఆ పేద కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. దాతలు స్పందించి పేద బిడ్డ ప్రాణాలు కాపాడాలని దీనంగా వేడుకుంటున్నారు.

దాతలు సాయం అందించాల్సిన ఫోన్, బ్యాంకు అకౌంట్ వివరాలు:
97016 84377 (ఫోన్ పే లేదా గూగుల్ పే)పాలకుర్తి
ఎస్‌బీఐ అకౌంట్ నంబర్: 2043 3814 533, ఐఎఫ్ఎస్‌సీ : ఎస్‌బీఐఎన్ 0014240

సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటికలు

వర్ధన్నపేట : భారతీయ నాటక కళాసమితి స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి నాటికల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 10 గంటలకు మొదట తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత?' అనే నాటికను ప్రదర్శించారు. ఇందులో ఇతివృత్తం ఇలా ఉంది. ఓ విప్లవ రచయిత కుమారుడు కుమార్. విప్లవ భావాలున్న ఆ తండ్రి తన కుమారుడు కుమార్‌కు మరో రచయిత కూతురితో ఆదర్శ వివాహం చేస్తాడు. కానీ ఆమె అతడితో ఇమడలేకపోతోంది. కుమార్ తన తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడం ఆమె భరించలేకపోతోంది. తన కూతుర్ని తీసుకెళ్లిపోతోంది. మరొకరితో అక్రమ సంబంధం ఏర్పరుచుకుంటుంది. అది ప్రశ్నించిన కుమార్‌పై పోలీసు కేసు పెడుతుంది. దీంతో న్యాయస్థానం ద్వారా ఆమెకు మనోవర్తి వస్తుంది. ఈ నిజం తెలిసినా పోలీసులు చట్ట ప్రకారం తాము ఏమి చేయలేమని అంటారు. చివరకు కుమార్ తన కూతురును ఇవ్వాలని భార్యను వేడుకుంటాడు. అయితే పాపను ఇవ్వను సరి కదా.. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని పాపని అంతమొందిస్తారు.


నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత? నాటికలోని ఓ సన్నివేశం

దీంతో అలసిపోయిన కుమార్ కన్నెర్ర చేస్తాడు. సామాన్యుడు అసామాన్యుడవుతాడు. చట్టమే స్వేచ్ఛను ఇస్తే ఇక వీటిని ఆపేదెవరు... ఈ సమాజం ఎటుపోతుంది. మేథావుల నిశ్శబ్దం జాతికి ప్రమాదమని.. ఈ ప్రశ్నల నుంచే ఉద్భవించిందే 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత' నాటిక. నటీనటుల హావభావాలు అందరినీ ఆకట్టుకుంది. అలాగే, రాత్రి 11 గంటలకు కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' అనే నాటికను రెండో ప్రదర్శనగా వేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

- ప్రొఫెసర్ వెంకటనారాయణ

న్యూశాయంపేట: ప్రజాస్వామ్య పరిరక్షణకు పౌరసంఘాలు ఐక్యంగా ఉండి పోరాడాలని ప్రొఫెసర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండ ములుగురోడ్డులోని ఓ సమావేశ మందిరంలో డాక్టర్ రాజ్‌మహ్మద్, ముజాహిద్ ఇర్ఫాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌తోపాటు వివిధ పౌరసంఘాల బాధ్యులు ప్రసంగించారు. అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ వీరన్న నాయక్, ఉపాధ్యక్షులుగా సోమ రాంమూర్తి, కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజ్‌మహ్మద్, జాయింట్ సెక్రటరీలుగా చలపతి, కుమారస్వామి, మీడియా ఇన్‌చార్జ్‌గా ఎ.నగేశ్, కోశాధికారిగా ఉదయ్‌సింగ్, అడ్వైజరీలుగా ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ, ఎర్రగట్టు స్వామి, ఓం బ్రహ్మం, సాంబయ్య, స్వామిని ఎన్నుకున్నారు. సమావేశంలో జిలుకర శ్రీనివాస్, అజీజ్, అలీమ్, తోఫిఖ్, నదీమ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ పౌరసంఘాల నేతలు

ప్రాణం తీసేందుకు పన్నాగం..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రవీందర్

కన్నాయిగూడెం : మూత్రవిసర్జనకు బయటికొచ్చిన ఓ వ్యక్తి ప్రాణం తీసేందుకు పథకం ప్రకారం అతడిపై విద్యుత్ వైర్లు వేయగా షాక్ తగలడంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని గంగాగూడెంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానిక ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాగూడేనికి చెందిన కావిరి రవీందర్ వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే కుటుంబంతో సహా ఫిబ్రవరి 29వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. అర్ధరాత్రి మూత్రం వస్తుందని బయటికి వచ్చాడు. కాగా ఇదే అదనుగా అదే గ్రామానికి చెందిన కావిరి ప్రమోద్ ముందస్తు పథకం ప్రకారం ప్రత్యేకంగా విద్యుత్ తీగను తగిలించిన ప్లాస్టిక్ పైప్ సాయంతో గుమ్మం ఎదుట కాపు కాస్తున్నాడు. తలుపు తీసి బయటికి వచ్చిన రవీందర్ పై విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు వేయడంతో రవీందర్ గాయపడి గట్టిగా అరిచాడు. అరుపులు విన్న కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వచ్చి విద్యుదాఘాతానికి గురైన రవీందర్‌ను రక్షించారు. ఇదంతా గమనించిన ప్రమోద్ అక్కడ నుంచి పారిపోయాడని రవీందర్ భార్య దేవి తెలిపారు. పారిపోతున్న ప్రమోద్ వద్ద ఓ కత్తి ఉందని, అది జారిపడిందని తెలిపారు. కొంత కాలం నుంచి ప్రమోద్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అందులో భాగంగానే తన భర్తపై విద్యుత్ షాక్ ప్రయోగించి ప్రాణాలు తీయాలని పథకం పన్నాడని అన్నారు. గాయపడిన రవీందర్‌ను 108 వాహనంలో ఏటూరునాగారం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.